02-05-2025
శుక్రవారం
మల్కాజిగిరి

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 219 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
jayabherinews
JB జయభేరి



...మిగతాది 2 లో




# మా వల్లే కులగణన

**కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**
**కుల గణనలో తెలంగాణ మోడల్ దేశానికే రోల్ మోడల్**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

మన్మోహన్ సింగ్ ప్రభుత్వం 2011లో సేకరించిన కుల గణన వివరాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం బయట పెట్టలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారు.. నాడు ప్రజల మనస్సులోని మాటను గ్రహించి కుల గణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.. తాము అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోని మా ప్రభుత్వం కుల గణన చేపట్టిందని అన్నారు.

## పంతాలకు పోవద్దు సమ్మె వద్దు

జయభేరి, హైదరాబాద్,మే 1:

తెలంగాణ ఆర్టీసీ కార్మికులు రాజకీయ పార్టీల వలలో పడి సంస్థకు నష్టం చేసే పనులు చేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ... ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతుందని ఏడాది తిరిగే సరికి సర్దుకుంటాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి కీలకమైన సమయంలో సమ్మె ఆలోచన చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఆ సంస్థ ఆదాయాన్ని కార్మికుల చేతుల్లోనే పెట్టేస్తామని ఎలా ఖర్చు పెట్టుకోవాలో చర్చిద్దామని సూచించారు. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చారు. మేడే సందర్భంగా ఈ డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడమని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోందని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికుల సంస్థ అని దీన్నికాపాడుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. రాష్ట్రంలో పదళ్లు ఆర్థిక దోపిడీ జరిగిందని ముఖ్యమంత్రి విమర్శించారు. ఆర్టీసీలో గత పదేళ్లు భారీ విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు,

...మిగతాది 2 లో

## మోడీ టూర్ ఇలా..



జయభేరి, విజయవాడ, మే 1:

ప్రధాని మోదీ అమరావతి టూర్ షెడ్యూల్ ఖరారైంది. అమరావతి పున: ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు మోదీ ఏపీకి వస్తున్నారు. రేపు.. మధ్యాహ్నం 2 గంటల 55 నిమిషాలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు మోదీ. ప్రధానికి మంత్రులు, కూటమి నేతలు స్వాగతం పలుకుతారు. మధ్యాహ్నం 3 గంటల 15 నిమిషాలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో వెలగపూడి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటారు. అక్కడ.. ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలుకుతారు. రాజధాని

...మిగతాది 2 లో

## ఇది మోదీ ప్రభుత్వం ఎవరూ తప్పించుకోలేరు




- **హోంశాఖ మంత్రి అమిత్ షా**

జయభేరి, న్యూఢిల్లీ, మే 1:

జమ్మూకశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఏప్రిల్ 22వ తేదీన ఉగ్రవాదులు దాడికి పాల్పడి.. 26 మంది పర్యాలకుల ప్రాణాలు తీసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా పాకిస్థాన్‌పై ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం నేర్పించేందుకు కేంద్రం కసరత్తులు చేస్తోంది. ఉగ్రవాదులను అంతం చేసేందుకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ప్రకటించింది.అయితే తాజాగా ఈ అంశంపై తొలిసారి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఉగ్రవాద పోరాటంలో భారత్‌కు అన్ని దేశాలు అండగా నిలుస్తాయని ఆయన అన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు మా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఉగ్రదాడికి పాల్పడినవారికి తగిన శిక్ష విధిస్తామని పేర్కొన్నారు. పిరికి దాడి చేసి.. అదో గొప్ప విజయంగా భావిస్తున్నారని అన్నారు. ఇది మోదీ ప్రభుత్వమని.. ఎవరూ తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో భారతీయులే కాదు.. ప్రపంచమంతా భారత్‌తో నిలుస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అమరావతి 2.0 వేడుక

**జగన్, షర్మిలను ఆహ్వానించిన చంద్రబాబు**







జయభేరి, విజయవాడ, మే 1:

అమరావతిలో పెద్ద పండుగకు అంతా రెడీ అయింది. ప్రధాని మోదీ వచ్చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరపడానికి ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా వైఎస్ జగన్, వైఎస్ షర్మిలకు ఏపీ ప్రభుత్వం ఆహ్వానం పంపడం ఏపీ రాజకీయాల్లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది రాజకీయ ప్రత్యర్థులుగా కాకుండా బద్ధశత్రువులుగా మారిపోయిన చంద్రబాబు వైఎస్ జగన్ మధ్య ఏం జరిగినా అది రాజకీయ సంచలనంగా మారుతూ వస్తోంది. అమరావతిలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులకు జగన్ ఆహ్వానం ఉంటుందని ఎవరూ భావించలేదు. కారణం అధికారికంగా ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా లేదు. పైపెచ్చు అమరావతికి బద్ధ విరోధిగా జగన్‌పై ఒక ముద్ర పడిపోయింది. మూడు రాజధానుల పేరుతో అమరావతికి క్యాపిటల్ హోదా దక్కకుండా చేయాలని జగన్ ప్రయత్నించారని అమరావతి రైతుల్లో బలమైన ముద్ర ఉంది. మూడు రాజధానుల బిల్లు తదనంతర అమరావతి ఉద్యమం సమయంలో రైతులపై పెట్టిన కేసులు పడిన లాఠీ దెబ్బలు జగన్ పట్ల ఒక విధమైన కోపాన్ని అమరావతి రైతుల్లో నింపేశాయి.

...మిగతాది 2 లో

## కులగణనతో బీజేపీ ఫ్యూచర్ ప్లాన్

2 లో



## కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్

జయభేరి, ముంబై, మే 1:

వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ వేవ్స్ ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ మీడియా పవర్ హౌస్‌గా భారత దేశాన్ని సమున్నతంగా నిలిపేందుకు భారత ప్రభుత్వం 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తోంది.. నాలుగు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు.. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ.. పేర్కొన్నారు. గత 100 సంవత్సరాలలో, భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకు చేరుకుందని ప్రధాని మోదీ అన్నారు.వేవ్స్ సమ్మిట్ 2025 (కనెక్టింగ్ క్రియేటర్స్, కనెక్టింగ్ కంట్రీస్) తో 100 కి పైగా దేశాల నుంచి కళాకారులు, సృష్టికర్తలు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలను ఒకే గొడుగు కిందకు వచ్చారని ప్రధాని మోదీ అన్నారు..

...మిగతాది 2 లో

## అంతర్జాతీయ సమావేశానికి హాజరుకానున్న కేటీఆర్



- **ఆక్స్ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్యవక్తగా రావాలంటూ కేటీఆర్ కు ఆహ్వానం**
- **ఇంగ్లాండ్ లోని ప్రతిష్టాత్మక ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో 2025 జూన్ 20, 21 తేదీల్లో**
- **యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, వివిధ దేశాల నిపుణులు సమావేశం**
- **ఇండియా సాధిస్తున్న ప్రగతిని వివరించనున్న కేటీఆర్**

జయభేరి, హైదరాబాద్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు మరో ప్రతిష్టాత్మక సమావేశానికి హాజరుకానున్నారు. 2025 జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్ లో జరిగే ఆక్స్ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్యవక్తగా పిలుస్తూ ఆ సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్ ను ఆహ్వానించింది. "భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు" అనే థీమ్ తో ఈ సంవత్సరం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్ ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకులు సిద్ధార్థ్ సేఠీ తెలిపారు. కెటిఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుంటే చర్చలు మరింత ఆసక్తికరంగా ఉంటడంతో పాటు భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో భాగం

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## పంతాలకు పోవద్దు సమ్మె వద్దు

పట్టింపులకు పోవద్దని హితవుపలికారు. ఏదైనా సమస్య ఉంటే మంత్రితో చర్చించి పరిష్కరించుకోవాలని తెలిపారు. వచ్చే ఆదాయమంతా కార్మికుల చేతిలో పెడతామని ఎలా ఖర్చు చేద్దామో సూచనలు చేయాలని సూచించారు. అణాపైసా కూడా ఇంటికి తీసుకెళ్లేది లేదని కార్మికుల కోసమే ఖర్చు చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అందుకే ఒకసారి ఆలోచించాలని సూచించారు. కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. సమ్మె పోటు రాష్ట్రానికి నష్టం చేస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోందని మరో ఏడాదిలో కుదురుకుంటుందని వివరించారు. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దని ఆర్టీసీ కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దన్నారు. నమ్మండి.. నమ్ముకున్న మీకు అండగా ఉంటా అని ఆర్టీసీ కార్మికులు భరోసా ఇచ్చారు. కార్మికుల చెమట చుక్కలే ప్రపంచ అభివృద్ధికి బాటలు వేస్తున్నాయన్నారు రేవంత్ రెడ్డి. తెలంగాణ సాధనలో సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ కార్మికులు, అసంఘటిత కార్మికుల పాత్ర మరువలేనిదని అభివర్ణించారు. తెలంగాణలో కార్మికులను ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ముందుకువెళుతున్నామని వెల్లడించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందంటే కార్మికుల సహకారం మరువలేనిదిగా చెప్పారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా ఇచ్చి బోనస్ ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానిదనని గుర్తు చేశారు. గత పదేళ్ల నిర్లక్ష్యంతో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి వచ్చిందన్నారు. ఒక పద్ధతి ప్రకారం నష్టాలను నివారిస్తూ ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టామని కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్మికులకు మేలు చేయడమే ప్రభుత్వ విధానమని అసంఘటిత కార్మికుల కోసం గిగ్ వర్కర్స్ పాలసీని త్వరలో తీసుకురాబోతున్నామన్నారు. గత ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్ష చూపిందని ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేసి 50 మంది కార్మికులను పొట్టన పెట్టుకున్నారని గుర్తు చేశారు. గత పాలకులు 50 వేల కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టారని తెలిపారు రేవంత్. 1 లక్షా 20 వేల కోట్లు ఇతర విభాగాల్లో పెండింగ్ పెట్టి వెళ్లారని వివరించారు. సర్పంచులకు బకాయిలు గత ప్రభుత్వం ఘనకార్యమే కదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టే నాటికి ప్రతీ సంస్థలో 8 లక్షల 29 వేల కోట్లు ఉందని చెప్పారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్ళకే కూలిందన్నారు. ఇంత చేసిన కేసీఆర్ ఇప్పుడు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని అన్నారు రేవంత్. కెసిఆర్ చేసిన గాయాన్ని ప్రజలు ఇంకా మరిచిపోలేదని తెలిపారు. అసెంబ్లీకి పంపిన పిల్లలు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని.. దళితుడిని ముఖ్యమంత్రిని చేయలేదు.. కనీసం ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా అవకాశం ఇవ్వండని డిమాండ్ చేశారు. కపటనాటక సూత్రధారి మళ్లీ బయల్దేరాడని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు

## మోడీ టూర్ ఇలా..

నిర్మాణంలో భాగంగా చేపడుతున్న పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు ప్రధాని. మరోవైపు ఏపీలోని పలు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రాజెక్టులు చేపడుతోంది. రేపు వాటి ప్రారంభోత్సవాలు కూడా అమరావతి వేదిక మీద నుంచే చేస్తారు ప్రధాని మోదీ. ఓవరాల్‌గా ఒక గంటా 15 నిమిషాల పాటు ప్రధాని మోదీ సభలో పాల్గొంటారు. షెడ్యూల్‌లోని కార్యక్రమాలన్నీ ముగిసిన తరువాత.. సాయంత్రం 4 గంటల 55 నిమిషాలకు తిరిగి హెలికాప్టర్‌లో గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఢిల్లీ వెళ్తారు.రాజధాని నిర్మాణంలో భాగంగా 49వేల 40 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు చేపడుతోంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయబోతున్నారు. ప్రాజెక్టులలో భాగంగా.. హైకోర్టు, సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాలతో పాటు న్యాయమూర్తుల నివాస సముదాయాలు ఉన్నాయి. వీటితో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల గృహ సముదాయం నిర్మాణాలకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన చేయబోతున్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కొన్ని ప్రాజెక్టులకు సైతం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. DRDO, DPIIT, NHAI, రైల్వేస్‌కు సంబంధించి.. దాదాపు 8 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు ప్రధాని. నాగాయలంకలో దాదాపు 1,500 కోట్ల రూపాయలతో నిర్మించే మిస్సైల్ టెస్ట్ రేంజ్ సెంటర్, విశాఖలో కేంద్ర ప్రభుత్వం నిర్మించే యూనిటీ మాల్‌కు శంకుస్థాపన వర్చువల్‌గా ప్రధాని చేతుల మీదుగా జరుగుతుంది. ఇక.. గుంతకల్ వెస్ట్ నుంచి మల్లప్ప గేట్ వరకు చేపట్టిన 293 కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజక్టుకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. 3176 కోట్ల విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులకు కూడా అమరావతి వేదికగానే వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపనలు జరుగుతాయి.ఇక.. 3వేల 680కోట్ల రూపాయల విలువైన పలు నేషనల్ హైవే పనులను సైతం ఇదే వేదిక నుంచి ప్రారంభిస్తారు ప్రధాని మోదీ. 254 కోట్ల రూపాయలతో నిర్మించిన ఖాజీపేటవిజయవాడ 3వ లైన్, గుంటూరుగుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బుగ్గనపల్లి, KUF పాణ్యం లైన్లను ప్రధాని ప్రారంభిస్తారు. ఓవరాల్‌గా.. 57వేల 962 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు ప్రధాని మోదీ.

## అంతర్జాతీయ సమావేశానికి కేటీఆర్

అవ్వడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని సిద్ధార్థ్ సేఠ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతో పాటు భారత్‌లోని స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు చర్చిస్తారు. వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణుల సమక్షంలో భారతదేశ ప్రగతిపథాన్ని, తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మోడల్ను కేటీఆర్ వివరించనున్నారు. ఈ సదస్సులో కేటీఆర్ పాల్గొంటే రాబోయే రోజుల్లో ప్రపంచం పై ఇండియా చూపే సానుకూల ప్రభావాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి బలంగా చాటొచ్చని సిద్ధార్థ్ సేఠ్ తెలిపారు. ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, సదస్సుకు రావాలని సిద్ధార్థ్ కోరారు. ఆక్స్ఫర్డ్ ఇండియా ఫోరమ్ సమావేశం యూరప్లో భారత్కు సంబంధించిన అతి పెద్ద కార్యక్రమం. భారతదేశ పురోగతి, ఆవిష్కరణలను ప్రపంచానికి చూపే వేదిక. మనదేశ అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులు, గ్లోబల్ సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. భారత్ను ప్రపంచానికి దగ్గర చేయడం, పరిశోధన, సాంకేతికత, విధానాల్లో ఇతర దేశాల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యం.

## అమరావతి 2.0 వేడుక

అది 2024 ఎన్నికల్లో ప్రస్ఫుటంగా కనపడింది కూడా. కాబట్టి ఆరేళ్ల గ్యాప్ తర్వాత మళ్ళీ మొదలవుతున్న అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు జగన్‌కు ఆహ్వానం ఉండదనే అందరూ భావించారు. చంద్రబాబు మాత్రం ప్రతి రాజకీయ నాయకుడిని ఈ కార్యక్రమంలో భాగం చేయాలని ఆహ్వానాలు పంపుతూ వస్తున్నారు. దానిలో భాగంగానే వైఎస్ జగన్‌కు ఆహ్వానం వెళ్ళినట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలకి ఆహ్వానం వెళ్ళింది. అయితే ఆమె రాష్ట్రానికి మోడీ రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అమరావతిలో నిరసన తెలియజేయడానికి వెళ్లి అరెస్టు కూడా అయ్యారు. అయినప్పటికీ ఆమెకు ఆహ్వానం పంపింది ఏపీ ప్రభుత్వం. వైఎస్ జగన్ ప్రస్తుతం రాష్ట్రంలో అందుబాటులోనే ఉన్నారు. షర్మిల మాత్రం బెంగళూరు వెళ్ళిపోయారు. వీరిద్దరూ అమరావతి పనుల ప్రారంభోత్సవానికి హాజరయ్యే అవకాశం కనిపించడం లేదు.2014, 19 మధ్యకాలంలో సీఎంగా ఉన్న చంద్రబాబు హయాంలోనే అమరావతి పనులకు ప్రారంభోత్సవం జరిగింది. అయితే సమయంలో చంద్రబాబు ఏకపక్షంగా వ్యవహరించారనే ప్రచారం విపక్షాలు గట్టిగా చేశాయి. కానీ ఈసారి ఎటువంటి పొరపాటు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. అమరావతి రైతులతో సమావేశం జరపడం, వారందరినీ సభకు ఆహ్వానించారు. ప్రతి రాజకీయ పార్టీ కీలక నేతలకు ఆహ్వానాలు పంపారు. మంత్రులకు విభాగాల వారీగా బాధ్యతలు అప్పజెప్పారు. రెండుసార్లు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఇలా ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు జరగకుండావస్తున్న ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా కూర్చొన్న చోటికి భోజనాలు వచ్చేలా ఏర్పాటు చేశారు. ఇలాంటి సమయంలో ఇబ్బందిగా మారే ట్రాఫిక్ సమస్యకి కూడా ముందుగానే నిర్దిష్టమైన ప్రణాళిక ఏర్పాటు చేసుకుంటూ వచ్చారు. కాశ్మీర్ ఘటన దృష్ట్యా ప్రధాని కార్యక్రమానికి భద్రతను మరింత పెంచినా సామాన్యులకది అర్థం అయ్యేలాగా ముందు నుంచే ప్రచారం చేస్తూ వస్తున్నారు. శుక్రవారం విజయవాడ మొత్తం ట్రాఫిక్ బంద్ కానుంది. కానీ ఆ విషయాన్ని సక్సెస్ ఫుల్‌గా ప్రజల దృష్టిలో పెట్టారు. కీలకమైన పనులన్నీ ముగియడంతో అమరావతి 2.0 పనుల ప్రారంభోత్సవానికి ఏపీ మొత్తం రెడీ అయిందని ప్రభుత్వం చెబుతోంది.

# కులగణనతో బీజేపీ ఫ్యూచర్ ప్లాన్

**బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుల ఆధారిత జనాభా గణనను ఆమోదించడం ద్వారా పెద్ద ట్రంప్ కార్డును వాడింది. కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కుల గణనను నిరంతరం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. దేశంలో కులగణన చేపట్టాలని బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన పొలిటికల్ అఫైర్స్ కేబినెట్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన సమాచారం ఇస్తూ, తదుపరి జనగణన సందర్భంగా కులగణన కూడా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.**

ఈ కేబినెట్ కమిటీలో మోదీతో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య మంత్రి పీయూష్‌గోయల్ ఉన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ కులగణనను వ్యతిరేకిస్తుందని వైష్ణవ్ అన్నారు. 2010లో అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కులగణన హామీ ఇచ్చారని, కానీ ఆ తర్వాత జరిగిందేమీ లేదని ఆయన అన్నారు.అదే సమయంలో బిహార్ రాజకీయాల్లో కాంగ్రెస్ మిత్రపక్షమైన ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ కూడా కుల గణనను డిమాండ్ చేస్తున్నారు. కానీ, మోదీ ప్రభుత్వం కుల గణనను ప్రకటించడం ద్వారా కాంగ్రెస్, RJD నుండి ఈ అంశాన్ని లాక్కున్నట్లు అయింది. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలు కుల గణనకు సంబంధించి తమ వ్యూహాన్ని పునఃపరిశీలించవలసి ఉంటుంది.గత కొన్ని సంవత్సరాలుగా, రాహుల్ గాంధీ, ప్రతిపక్ష పార్టీలు కుల గణన డిమాండ్ కోసం కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తున్నాయి. రాహుల్ గాంధీ తన ప్రసంగాలలో, ప్రచారాలలో చాలాసార్లు తన ప్రభుత్వం ఏర్పడితే కుల గణన నిర్వహిస్తామని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తి వేస్తామని చెప్పారు. కానీ ఇప్పుడు మోదీ ప్రభుత్వం కులగణన చేస్తామని ప్రకటించడంతో ప్రతిపక్షాల వ్యూహాన్ని దెబ్బ కొట్టినట్లు అయింది. ఈ నిర్ణయం బీజేపీకి బీహార్ ఎన్నికలకు ముందు రాజకీయంగా చాలా కీలకంగా మారనుంది. దీని కారణంగా, ఒక ప్రధాన ఎన్నికల అంశం కాంగ్రెస్, ప్రతిపక్షాల చేతుల్లోంచి జారి పోయినట్లే.బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు కుల గణనను వ్యతిరేకించాయని బీజేపీ ఆరోపిస్తోంది. స్వాతంత్ర్యం తర్వాత జరిగిన అన్ని జనాభా లెక్కల్లో కులాలను లెక్కించలేదని అన్నారు. కులాల సరైన జనాభా గణన నిర్వహించాలనే ఉద్దేశ్యాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ చూపించలేదని, 2010లో అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ లోక్‌సభలో కుల గణనను కేబినెట్‌లో పరిశీలిస్తామని చెప్పారని, అయితే దీని తర్వాత ఒక కేబినెట్ గ్రూప్ మాత్రమే ఏర్పడిందని, ఆ కమిటీ సిఫార్సులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కుల డేటాను సేకరించడానికి బదులుగా సామాజికఆర్థిక సర్వే మాత్రమే






నిర్వహించిందని బీజేపీ ఆరోపించింది. కుల గణనను కాంగ్రెస్ రాజకీయ ఆయుధంగా మాత్రమే ఉపయోగిస్తున్నాయని బీజేపీ చెబుతోంది.కుల గణనలో దేశ పౌరుల కులం ఆధారంగా డేటాను సేకరిస్తారు. దీని వలన ఏ కులం, ఏ వర్గాల జనాభా ఇంకా సామాజిక ప్రయోజనాలను పొందలేదో తెలుస్తుంది. ఈ జనాభా గణనను మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. అయితే ఇప్పటివరకు సామాజికఆర్థిక జనాభా గణన మాత్రమే నిర్వహించారు.కేబినెట్ నిర్ణయాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వాగతించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.''మేం కొంతకాలంగా కులగణన గురించి చెబుతూనే ఉన్నాం. మోదీ ప్రభుత్వం గతంలో దీనిని వ్యతిరేకించింది, ఏవేవో కారణాలు చూపింది. ఇప్పుడు, వాళ్లు అకస్మాత్తుగా ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.ఈ నిర్ణయాన్ని మేం స్వాగతిస్తున్నాం. కానీ, దీని అమలుకి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను డిమాండ్ చేస్తున్నాం'' అని అందులో రాశారు.కులగణనకు తెలంగాణ రాష్ట్రం ఒక నమూనాగా నిలుస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. ఈసారి జరగనున్న జనగణన సందర్భంగా కులగణన కూడా చేపట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర కేబినెట్ చారిత్రక నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.''జనగణనతో పాటే కులగణన చేపట్టడం మరింత పారదర్శకతను తీసుకొస్తుంది. రాజకీయ అవకతవకలకు అవకాశం లేకుండా చేస్తుంది'' అని ఆయన ఎక్స్‌లో రాశారు.కులగణన నిర్ణయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్‌లో స్పందించారు.''నేడు, తెలంగాణ ఏం చేస్తుందో, దేశం దానిని రేపు అనుసరిస్తుందని నిరూపించాం'' అని ఆయన రాశారు.''రాహుల్ గాంధీ దిశానిర్దేశంలో, భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని డిమాండ్ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. దానికి అనుగుణంగానే రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే నిర్వహించాం. రాష్ట్ర జనాభాలో 56.32 శాతం మంది వెనకబడిన కులాలకు చెందిన వారని తేలింది.తెలంగాణ శాసనసభలో సమర్పించిన నివేదిక ఆధారంగా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానించి, ప్రతిపాదనలు కూడా చేశాం.''అహ్మదాబాద్‌లో ఏప్రిల్ 9న జరిగిన ఏఐసీసీ సమావేశంలో చేసిన తీర్మానం కాపీని జైరాం రమేశ్ పోస్ట్ చేస్తూ, ''అహ్మదాబాద్‌లో ఏప్రిల్ 9 నాటి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయంపై తీర్మానం చేసి, ఆమోదించింది. అసలు జరగకపోవడం కంటే, ఆలస్యంగానైనా జరగడం మంచిదే'' అని ఆయన రాశారు.

# మా వల్లే కులగణన




✍ జయభేరి, హైదరాబాద్, మే 1:

కాంగ్రెస్ నినాదం, తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన మోడల్, బిహార్‌లో ఉన్న రాజకీయ అవసరాల కోసమే కేంద్రం కులగణనకు ఓకే చెప్పిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మొన్నటి వరకు కులగణన చేయబోమని కోర్టుల్లో అఫిడవిట్‌లు ఇచ్చిన కేంద్రం ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక కాంగ్రెస్ పార్టీ ఒత్తిడే ఎక్కువ ఉందని చెప్పుకొచ్చారు. అడుగడుగునా వెంటాడిన కాంగ్రెస్, ఈ నిర్ణయం మోదీ తీసుకునేలా చేసిందని చెప్పుకొచ్చారు. దీనికి తోడు తెలంగాణ చేపట్టిన సర్వే కూడా కేంద్రానికి మోడల్‌గా మారిందని వివరించారు. దేశవ్యాప్తంగా జోడో యాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ ప్రజల గుండెచప్పుడు విన్నారని రేవంత్ అన్నారు.

అందుకే కులగణన చేస్తామని హామీ ఇచ్చారని సీఎం గుర్తు చేశారు. కులగణన సమాజానికి ఎక్స్ రే లాంటిదని రాహుల్ గాంధీ ఆనాడే చెప్పారని వెల్లడించారు. రాహుల్ సూచనలతోనే తెలంగాణలో కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి ముఖ్యమంత్రి ధన్యావాదాలు తెలియజేశారు. తెలంగాణ అసెంబ్లీలో రెండు తీర్మానాలు చేసి కేంద్రానికి పంపామని సీఎం గుర్తు చేశారు. జనగణనలో కులగణన చేపట్టాలని, రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని తొలగించాలని తీర్మానం పంపించిన విషయాన్ని ప్రస్తావించారు. జంతర్‌మంతర్ వద్ద బీసీ సంఘాలతో కలిసి ధర్నా చేపట్టామని వెల్లడించారు. తమ ఒత్తిడికి తలొగ్గి ప్రధాని మోదీ కులగణనపై నిర్ణయం తీసుకున్నారని చెప్పుకొచ్చారు. జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రం తీసుకున్నా నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రధాని చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణనకు అనుసరించే విధానాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని సూచించారు. ఇందుకు కేంద్రమంత్రులతో కూడిన కమిటీతోపాటు, అధికారులతో కూడిన మరో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కులగణన చేపట్టే క్రమంలో తెలంగాణ విధివిధానాలు రూపొందించి ప్రజల ముందు పెట్టామని తెలిపారు. తెలంగాణలో 57 ప్రశ్నలతో 8 పేజీలతో కూడిన సమాచారాన్ని సేకరించామని వివరించారు. ఇందులో అన్ని రాజకీయ పార్టీలను భాగస్వాములను చేశామని అన్నారు. ఎక్కడా పార్టీ కార్యక్రమంలా చేయలేదన్నారు. అందరినీ భాగస్వామ్యంతో తెలంగాణలో కులగణన పూర్తి చేశామన్నారు రేవంత్ రెడ్డి. కులగణనలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో నిలిచిందన్నారు. దేశానికి తెలంగాణ ఒక మోడల్‌గా నిలిచిందని వెల్లడించారు. కులగణనపై కేంద్రంతో తమ అనుభవాన్ని పంచుకోవడానికి ఎలాంటి భేషజాలు లేవని ప్రకటించారు. బలహీన వర్గాలకు మేలు జరగాలనేదే తమ సంకల్పమని అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలను అమలు చేసేందుకు ఎవరితోనైనా కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం కులగణన చేసిచూపించిందన్నారు.

విమర్శలు చేసే బీజేపీ నేతలకు కొన్ని ప్రశ్నసంధించారు రేవంత్ రెడ్డి. పదేళ్లుగా అధికారంలో ఉన్నా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేయలేదని అడిగారు. రాష్ట్ర బీజేపీ నేతలు రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నారన్నారు. స్థానిక బీజేపీ నాయకుల్లో అసూయ, అసంతృప్తి కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి విధానాలను మోదీ అనుసరిస్తున్నారనే బాధ వారిలో ఉందన్నారు. వాళ్లు ఎన్ని చెప్పుకున్నా ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణ మోడల్ దేశానికి రోల్ మోడల్ అని పునరుద్ఘాటించారు.




## కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్
## వేవ్స్ సమ్మిట్‌లో చిరంజీవి సందడి

▶▶ మొదటిపేజీ తరువాయి

WAVES సమ్మిట్ సృజనాత్మకత కేంద్రంగా అభివర్ణించారు.కాగా.. ఈ వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ లో బాలీవుడ్, టాలీవుడ్ సహా.. భారత సినీ ఇండస్ట్రీకి చెందిన అగ్రనటులు, పలువురు వ్యాపార దిగ్గజాలు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు.. ఈ సమ్మిట్ లో బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, రణ్‌బీర్ కపూర్, దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్ సహా ఇతర ప్రపంచ తారలు పాల్గొన్నారు.

వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్‌ను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో నాలుగు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా వేవ్స్ సమ్మిట్ జరగనుంది. 'కనెక్టింగ్ క్రియేటర్స్..కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తున్నారు. మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే ప్రోగ్రామ్ ఇది. ఈ కార్యక్రమానికి మీడియా, వినోద రంగానికి చెందిన సీఈఓలు, పరిశ్రమలకి చెందిన ప్రముఖులు హాజరు కానున్నారు. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని..ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ ప్రధాని మోదీ వెల్లడించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని వివరించారు. ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, రణ్‌బీర్ కపూర్, దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్ సహా ఇతర ప్రపంచ స్థాయి నటీనటులు సందడి చేశారు.అయితే రజనీకాంత్, మోహన్ లాల్, హేమ మాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, మోహన్ లాల్ కలిసి ఓ గ్రూప్ ఫొటోకు ఫోజులిచ్చారు. నెట్టింట ఈ పిక్ ఎంతగానో వైరల్ అవుతోంది. చాలా రోజుల తర్వాత ఆ నాటి సీనియర్ హీరోలు అందరు కలిసి ఇలా ఫొటో దిగగా, ఇప్పుడు ఈ పిక్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. అలనాటి మేటి స్టార్స్ ఇలా ఒకే గ్రూప్ పిక్‌లో చూడడం చాలా ఆనందంగా ఉందని నెటిజన్స్ పోస్టులు పెడుతున్నారు. కాగా, ఈ కార్యక్రమం కోసం చిరంజీవి బుధవారమే ముంబయికి చేరుకున్నారు.

# ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించిన సిఐటియు

**జయభేరి, పరవాడ:**




పరవాడ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మే డే మండలంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఫార్మా సిటీలో విజయశ్రీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు జెండాను సీనియర్ నాయకులు కృష్ణ ఆవిష్కరించారు. బైకాన్ స్టాప్ అండ్ వర్కర్ యూనియన్ సిఐటియు జెండాను యూనియన్ నాయకులు బాబురావు ఆవిష్కరించారు. ఐటీసీ వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కర్రి పోతు నాయుడు సిఐటియు జెండా ఆవిష్కరించారు. సింహాద్రి జంక్షన్లో ముఠా వర్కర్స్ సిఐటియు జెండాను నాగప్పరావు ఆవిష్కరించారు. రాంకీ ఎస్సీ జడ్ వద్ద సిఐటియు జెండాను యూనియన్ నాయకులు ఎస్ శ్రీను ఆవిష్కరించారు. కొత్తపాలెం మఠ వర్కర్స్ యూనియన్ సిఐటియు జెండాని కే.రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల ప్రాణ త్యాగాలతో 8 గంటల పని సాధించిన ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే కార్మికుల సాధించుకున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం దొంగచాటుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి వాటిని అమలు చేయడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది దీనిని నిరసిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక , రైతు సంఘాలు మే 20 తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ చట్టాలు అమలు జరిగితే ఇప్పుడున్న కార్మిక హక్కులు ఉండవని ప్రైవేటీకరణ, కాంట్రాక్టు పద్ధతిలో అతి తక్కువ జీతాలతో పని చేయడం పని భద్రత లేకపోవడం వంటి అనేక సమస్యలతో కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు గురవుతారని ఈ లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మికులందరిలో ప్రచారం నిర్వహించి పరవాడ మండలంలో 25 సెంటర్లో మేడే నిర్వహించినట్లు గని శెట్టి తెలిపారు. అనంతరం మేడే విజయవంతం చేయాలని మేడే వర్ధిల్లాలి ఈనెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని నినాదాలు చేశారు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడారు. ఐద్వా జిల్లా అధ్యక్షరాలు పి మాణిక్యం ఆర్ శంకరరావు, మండల కన్వీనర్ ఎం రమణి పాల్గొన్నారు. లంకెలపాలెం లో మేడే సిఐటియు ఆధ్వర్యంలో లంకెలపాలెం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే సిఐటియుజెండాను ఆవిష్కరించారు. ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కే వెంకట్రావు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. లంకెలపాలెం మార్బుల్, వ్యాన్ డ్రైవర్లు ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. మినీ వ్యాన్ డ్రైవర్లు లంకెలపాలెం బ్రిడ్జి వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు నజీర్ మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కులు కాపాడుకోవడానికి కార్మికుల ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్దపు.శ్రీను, రమణ, కనకారావు, రమేష్, ఎస్ సంతోష్, లక్ష్మణ్, ఎస్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులకు అభినందనలు

**జయభేరి, మేడిపల్లి :**


పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్ యొక్క పదవ తరగతి విద్యార్థులు అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించినందుకు అభినందనలు అందుకున్నారు. ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఆకుల మధుకర్ గౌడ్ విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించి, ఉత్తమ ఐదుగురు విద్యార్థులకు పదివేల రూపాయల చెక్కులను మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటి మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ సమక్షంలో ప్రదానం చేశారు. విద్యార్థుల కృషిని, విద్యాసంస్థ యొక్క దక్షతను ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కుర్ర షాలిని శ్రీకాంత్ గౌడ్, మాదుగుల చంద్రకళ చంద్రారెడ్డి సందర్శించి విద్యార్థులను అభినందించారు.

## గ్రంథాలయం భవనం శంకుస్థాపన



**జయభేరి, ఎల్బీనగర్ :**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని NGO's కాలనీ లైబ్రరీ గ్రౌండ్ లో 1కోటి 95లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న గ్రంథాలయం భవనం యొక్క శంకుస్థాపన కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, బిజెపి పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, వనస్థలిపురం డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, NGO's కాలనీ పెద్దలు పాల్గొనడం జరిగింది.



## స్థలం వివాదంలో ఘర్షణ

- ఒక వ్యక్తికి గాయాలు

**జయభేరి, రంగారెడ్డి జిల్లా :**

రంగా రెడ్డి జిల్లా, అబ్దుల్లాపుర్మెట్ మండల్లోని కోహేడా గ్రామ రెవెన్యూలో సర్వే నెంబర్ 951, 952లో 7.28 ఎకరాల భూమి గురించి ప్లాట్ ఓనర్లు బద్రి అశోక్, సత్యనారయణ రెడ్డి, రఘు ఇంకా కొంతమందికి, సంరెడ్డి బాల్ రెడ్డిల మధ్య వివాదం కొనసాగుతోంది. అసలు భూ యజమానులు కంగుల కుటుంబ సభ్యులు కంగుల రాములు, పోచయ్య, మరి కొంతమంది కలసి కంగులా గండయ్య, కంగులా ఈదయ్యలకు సాధారణ పవర్ అటార్నీ (జిపిఎ)ను మంజూరు చేశారు. వారు అట్టి భూమిని 1970లో లేఅవుట్ చేసి 170 ఓపెన్ హౌస్ ప్లాట్లుగా మార్చారు. వినియోగదారులకు విక్రయించారు. ఆ తరువాత కంగుల కుటుంబ చట్టబద్ధమైన వారసులు అంతకుముందు GPA చట్టబద్ధంగా చెల్లదని ఇట్టి భూమిని 2013వ సంవత్సరంలో సంరెడ్డి బాల్ రెడ్డికు విక్రయించారు. 2014వ సం.నుండి భూమి వివాదం నడుస్తుంది. ఇట్టి వివాదం గురించి ప్లాట్ యజమానులు OS No. 839/2015ను I Addl.సీనియర్ సివిల్ కోర్టు, ఎల్బీనగర్ నందు దాఖలు చేయాగ 28.03.2025 రోజు వీరికి Perpetual Injunction ఆర్డర్ ఇవ్వటం జరిగినది. సంరెడ్డి బాల్ రెడ్డి 19.02.2025 నాడు పోలీసు జోక్యాన్ని నిరోదిస్తూ రిట్ పిటిషన్ 3790/2025 హైకోర్టు నందు దాఖలు చేయాగ హైకోర్టు పోలీస్, హైడ్రా కి జోక్యం చేసుకోకుండా ఆర్డర్ ఇవ్వటం జరిగినది. 01.05.2025 న మధ్యాహ్నం 12:00 గంటలకు 20 మంది ప్లాట్ యజమానులు సత్యనారాయణ రెడ్డి, బద్రి అశోక్, రఘు, కుమారి, గణేష్, వెంకట్ రెడ్డి మరి కొంత మంది తమకు కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ వచ్చిందని తమ ప్లాట్లను శుభ్రం చేయడానికి జెసిబితో భూమిలోకి ప్రవేశించి వాళ్ళ ప్లాట్స్ ను క్లీన్ చేసుకోనుచుండగ సంరెడ్డి బాల్ రెడ్డి, సంరెడ్డి దిలీప్ రెడ్డి, శీలం శ్రీను, మరొకరు వచ్చి ప్లాట్ యజమాని సత్యనారాయణ రెడ్డి, పండుగల వెంకటేష్, నవీన్ రెడ్డి, బద్రి అశోక్, రఘు, వెంకట్ రెడ్డి, మరికొంత మంది ప్లాట్ ఓనర్స్ తో గొడవపడి కర్రలు, రాళ్ళు, గడ్డికోసే కత్తితో కొట్టగా సత్యనారాయణకి తలకు, నవీన్ చిటికన వేలుకు, వెంకటేష్ కి స్వల్ప గాయాలు కావటం జరిగినది. ఇట్టి గొడవలో సంరెడ్డి బాల్ రెడ్డికి కూడా ప్లాట్ ఓనర్స్ కర్రలు, రాళ్ళతో కొట్టగా తలకు, లోపలి గాయాలు అయినవి అని పరస్పరం పిర్యాదు చేసుకోగా కేసు నమోదు చేయనైనది. ఈ స్థలం విషయంలో పోలీస్ జోక్యని నివారిస్తూ హైకోర్టు ఆర్డర్ 19.02.2025 నాడు ఇవ్వటం జరిగినది.

## రోడ్డు కబ్జా గురి కాకుండా కాపాడాలి

- హైడ్రాధికారులను కోరిన సాయి నగర్ కాలనీవాసులు

**జయభేరి, మేడిపల్లి :**



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి సర్వేనెంబర్ 29, 30 సాయి నగర్ కాలనీలో వరంగల్ హైవే నుండి కాలనీ లోనికి వచ్చే మున్సిపాలిటీ ముప్పై ఫీట్ల రోడ్డు గత 30 సంవత్సరాల నుండి ఉంది. ఈ రోడ్డును చూపించి కాలనీలో పలు అపార్ట్మెంట్లు నిర్మించడం జరిగింది. ఈ రోడ్డును చూసి కాలనీలో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేశారు.

ఈ రోడ్డుపై నిత్యం సుమారు వంద కుటుంబాలు ప్రయాణం కొనసాగిస్తారు. ఈ రోడ్డులో మున్సిపల్ కార్పొరేషన్ వారు వేసిన డ్రైనేజీ పైపులైను, కరెంటు లైన్, వాటర్ లైన్ ఉంది. ఒకతను తమ ప్లాటని కబ్జా చేసి రోడ్డుకు అడ్డంగా బేస్మెంట్ నిర్మాణం చేస్తున్నాడు.

వెంటనే కాలనీవాసులు అందరూ కలిసి దానిని తొలగించాలని మున్సిపల్ అధికారులకు లిఖితపూర్వకంగా, హైడ్రా కమిషనర్ కు ట్విట్టర్ వేదికగా ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి కబ్జా గురైన ప్రాంతానికి విచ్చేశారు వారి వెంట మున్సిపల్ అధికారులు కూడా వచ్చారు. కాలనీవాసులు వారి వద్ద ఉన్న పత్రాలు హైడ్రా అధికారికి చూపించి రోడ్డు కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరారు. రోడ్డుకు అడ్డంగా నిర్మిస్తున్న బేస్మెంట్ ను తొలగించాలని వేడుకున్నారు. వారు సమస్య పరిష్కారం అయ్యే విధంగా చేస్తామని తెలిపారని కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ప్రవీణ్ రాథోడ్, జైపాల్ రెడ్డి, యుగంధర్ రావు, సోమయ్య, వెంకటేశ్వరరావు, సత్తిరెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకటా చారి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాపాడాలి

- కార్మికులందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు
- స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో అంకిత ఎన్జీవో టీం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసారు. అనంతరం అంకిత ఎన్జీవో టీం తరపున కార్మికులకు ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్రామిక, కర్షక, కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల రెక్కల కష్టానికి వెలకట్టలేమని, వారి త్యాగం అసామాన్యమైనదని తెలిపారు చారిత్రాత్మక మే డే ఆవిర్భావ నేపథ్యాన్ని ఈ సందర్భంగా స్మరించుకుని మేడే స్ఫూర్తితో, శ్రామికుల హక్కులను కాపాడుతూ వారి జీవన భద్రతకు భరోసాను పెంచాయన్నారు. ఈ కార్యక్రమంలో అంకిత ఎన్జీవోస్ టీం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బ్రహ్మం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిహార్ అహ్మద్, CSC కోఆర్డినేటర్ గణేష్, పార్టీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, సురేష్ కుమార్, భాను, ఠాగూర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమాంబ పండుగ సందర్బంగా అమ్మవారిని దర్శించుకొన్న గుడివాడ

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం పెదమూషిడివాడ పంచాయతీ గండివానిపాలెం గ్రామంలో దుర్గమాంబ పండుగ మహోత్సవ సందర్భంగా మాజీ మంత్రి,అనకాపల్లి జిల్లా వైకాపా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పండగ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన వైస్సార్సీపీ నాయకులని వై.సి.పి జిల్లా యువజన విభాగం కార్యదర్శి నందవరపు శ్రీను స్వాగతం పలికార . ఈ సందర్భంగా గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ ఈ పండుగ మహోత్సవ సందర్భంగా తమను ఆహ్వానించినందుకు , అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అమ్మవారి చల్లని చూపు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, సుభిక్షంగా ఆనందంగా ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నాను అని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో వై.సి.పి నియోజకవర్గ ముఖ్య నాయకులు పైల శ్రీనివాసరావు,గండి రవి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, పెదమూషిడివాడ సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి, గొర్లివాన్నిపాలెం ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకు నాయుడు, వై.సి.పి నాయకులు పైల అప్పలనాయుడు, బొద్దపు చిన్నారవు, యలమర్తి బుజ్జి, వై.సి.పి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు పాల్పడిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పై పోలీసులకు ఫిర్యాదు

- కాంగ్రెస్ నేత గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పై కాంగ్రెస్ నేత గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో గ్రంథాలయ భవన నిర్మాణ భూమి పూజ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. వెళ్ళిపోతూ చంద్రశేఖర్ రెడ్డి ఎక్కడ ..? అతని సంగతి చూస్తానంటూ కాంగ్రెస్ కార్యకర్తలతో మాట్లాడుతూ.. బెదిరింపులకు పాల్పడినట్లు చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. రౌడీ షీటర్లు, డ్రగ్స్ బ్యాచ్ లతో కలిసి సుధీర్ రెడ్డి తనపై దాడి చేయాలని ప్రయత్నం చేస్తున్నాడని, సుధీర్ రెడ్డితో తనకు ప్రాణహాని ఉంది అని, తనకు, తన కుటుంబానికి ఏమైనా జరిగితే సుధీర్ రెడ్డిదే బాధ్యత అని పేర్కొన్నారు. ఇటీవల హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ ని అవమానిస్తూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై.. ఆమెతో కలిసి ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో మహిళా కమిషన్ కు వెళ్లి సుధీర్ రెడ్డి పై ఫిర్యాదు చేసినందుకే తనపై కోపం, పగ పెంచుకొని దాడులకు యత్నిస్తున్నాడని చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై బెదిరింపులకు పాల్పడిన సుధీర్ రెడ్డి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## విద్యార్థుల మధ్య ఘర్షణ



**జయభేరి, హైదరాబాద్:**

జేఎన్టీయూ యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థుల పైన ఐబీఎస్ లా చదివే విద్యార్థులు దాడి చేశారంటూ విద్యార్థులు ఆరోపించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. అమ్మాయి విషయంలో అసభ్యంగా ప్రవర్తించడంతో అమ్మాయి తరపు సభ్యులు కాలేజీకి వచ్చి అడిగారని స్థానికులు తెలిపారు. దీనితో ఇరు వర్గాలకు చెందిన వారికి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు పోలీసులు తెలిపారు.


## బెట్టింగ్ భూతానికి యువకుడి బలి

**జయభేరి, మేడ్చల్:**



అప్పులు చేసి ఆన్లైన్లో క్రికెట్ బెట్టింగ్కు పాల్పడగా..డబ్బులు పోవడంతో మనస్థాపంతో చెందిన యువ కుడు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ యాదగిరి రెండో కుమారుడు రాహుల్ (24) ఇంటర్ వరకు చదివి ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

మద్యం తాగడం, ఆన్లైన్ బెట్టిం గ్లకు అలవాటు పడిన రాహుల్ అలియాస్ సన్నీ కొన్ని రోజులుగా అప్పులు చేసి ఐపీఎల్ బెట్టింగ్లో డబ్బులు పెట్టగా నష్టం వచ్చింది. దీంతో రూ.4 లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన రాహుల్ రాత్రి ఇంట్లో పై పోర్షన్లోని తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విష యాన్ని కుటుంబీకులు గమనించి కన్నీరుమున్నీరయ్యారు.



## మైసమ్మగూడలో మేడే వేడుకలు

**జయభేరి, మేడ్చల్ :**

కార్మికలోకం సాగించిన ఐక్య పోరాటాలతో దక్కిన ఫలితానికి మేడే ప్రతి రూపమని ఆటో యూనియన్ నాయకులు అన్నారు. గురువారం మేడే దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు, కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నర్సింగ్, శేఖర్, దామోదర్, నాగరాజు, విరేశ్, నరేష్, వెంకట్, నర్సింగ్ రావు, రాజు, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతకు నిదర్శనం మే డే

- గుండ్లపోచంపల్లిలో ఘనంగా మేడే వేడుకలు



**జయభేరి, మేడ్చల్ :**

ప్రపంచం నలుమూలన కష్టపడే కార్మిక, కర్షక, శ్రామిక శక్తులతో ఐక్యంగా ఉన్నప్పుడే కార్మికుల హక్కులను సాధించుకోవచ్చని మేడ్చల్ జిల్లా ఎఐటీయూసి నాయకుడు ఏసురత్నం అన్నారు. గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్మికులు ఏర్పాటు చేసిన ఎఐటీయూసి పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏసురత్నం మాట్లాడుతూ కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉంటే తమ హక్కులను సాదించుకోవచ్చని, కార్మికుల హక్కుల సాధన కోసం ప్రతీఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్మికులు చాలిచాలని వేతనాలతో కాలం వెల్లదిస్తున్నారని ప్రతీ కార్మికునికి ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని హక్కులను సాధించాలంటే ఐక్యతతో ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బి.రమేష్, బి.ప్రభాకర్, కిరణ్, యాదగిరి, గణేష్, యాదమ్మ మంజుల, అమృత, దప్పు రమేష్, బి.శ్రీనివాస్, నర్సింగ్ రావు, సుభాష్, బాలేష్, వెంకటేష్, కృష్ణ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర



**జయభేరి, సైదాపూర్ :**

డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర సైదాపూర్ మండల్ లో పలు గ్రామాలలో ఈ డ్రగ్స్ నిర్మూలన యాత్రలో మండల మహిళా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. డ్రగ్స్ మన పల్లెలకు విస్తరించినవ ఆ మహమ్మారిని మన పేద విద్యార్థులను యువకులను బలి తీసుకుంటున్నది మన పేద కుటుంబాలను విచ్చిన్నం చేస్తుంది ఆర్థికంగా సామాజికంగా కృంగదీస్తుంది యువత భవిష్యత్తును అంధకారంగా చేస్తుంది ఈ ప్రమాదకరమైన ఈ డ్రగ్స్ ను తరిమి కొట్టాలని సంకల్పంతో వివిధ గ్రామాలలో మహిళా సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ అధ్యక్షులు సి ఓ లు గ్రామంలో నాయకులు యువకులు పాల్గొనడం జరిగింది.

## కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి



**జయభేరి, పీ ఏ పల్లి :**

మేడే సందర్భంగా HMWS కృష్ణ డ్రింకింగ్ వాటర్ రంగారెడ్డి గూడెం స్టేజినందు BRTU సంగం ఆధ్వర్యంలో మాజీ దేవరకొండ శాసనసభ్యులు BRS పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రామికులు శ్రమ దోపిడీకి గురి కావడం వల్ల ఆనాడు శ్రామికులంతా ఏకమై పని ఒత్తిడిని గంటలకు తగ్గించే విధంగా పెద్ద ఎత్తున పోరాటం చేసి ఎంతోమంది అమరులైనారు వారికి ముందుగా జోహార్లు తెలియజేసి, ఇప్పటికీ కూడా మన దేశంలో శ్రమ దోపిడికి గురి అవుతున్నారని, ఆనాడు హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ ప్లాంట్ లో కూడా శ్రమ దోడిపిడికి గురి అవుతున్న కార్మికులకు బి ఆర్ టి యు సంఘం ద్వారా వాళ్ళ పని సమయమును ఆరు గంటలను తగ్గించి, వారి జీతభత్యాల విషయంలో కూడా BRTU సంఘం పనిచేసిందని ఆయన గుర్తు చేశారు. ఆనాడు ఈ క్రిష్ణ వాటర్ ప్లాంట్ లో పనిచేసే కార్మికుల ఐక్యత వలన ఇదంతా సాధ్యమైంది ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు యెలూగూరి వల్లపు రెడ్డి, మునగాల అంజి రెడ్డి, అర్వపల్లి నరసింహ, ఎర్ర యాదగిరి, గోలి గిరి, రాయనబోయిన శ్రీను, సుధాకర్ గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, పోలే వెంకట్, నారాయణదాసు వెంకన్న, తులసి, నాగరాజు, మల్లీ కంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# హైవే ప్రాజెక్టులకు అడగడుగునా అడ్డంకులు
# భూసేకరణలో ప్రధాన ఇబ్బందులు

**జయభేరి, హైదరాబాద్ :**



రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారింది. వివిధ కారణాలతో క్షేత్రస్థాయిలో ఏర్పడుతున్న ఇబ్బందుల ఫలితంగా భూసేకరణ ఎక్కడికక్కడ పెం డింగ్‌లో ఉంటోంది. ఫలితంగా హైవేల నిర్మాణంలో పెద్దగా పురోగతి కనిపించడం లేదుపలు హైవే ప్రాజెక్టులకు భూసేకరణ ఆలస్యం వల్ల పనులు చేపట్టేందుకు ఇబ్బంది అవుతోందని ఇప్ప టికే పలుమార్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో పేర్కొన్నారు.అటవీశాఖ అనుమతుల జాప్యం కారణంగా సుమారు 10 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే తాము వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలో రూ.4,891 కోట్లతో 233 కి.మీ మేర చేపట్టిన 7 హైవే ప్రాజెక్టులను ఇప్పటికే కేంద్రం మంజూరు చేసిందని ఆయన పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నం నుంచి వరంగల్, హైదరాబాద్ మీదుగా కొడంగల్ (రావులపల్లి) వరకు ఉన్న ఎన్‌హెచ్ 163 హైవే పరిధిలో హైదరాబాద్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు కు ఇరువైపులా ఉన్న పర్యావరణ ఇబ్బందుల కారణంగా పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నా యి. ఫలితంగా నగరం నుంచి చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్, బీజాపూర్ వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మహారాష్ట్రలోని దౌండ్ నుంచి ఒడిశాలోని కోరాపుట్ వరకు ఉన్న ఎన్ హెచ్ 63 పరిధిలో నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో 131 కి.మీ మేర హైవే విస్తరణ పనులు సాగుతున్నాయి. 554 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా..206 హెక్టార్లకు ముసాయిదా అవార్డులు సిద్ధం చేశారు. మరో 287 హెక్టార్లకు అవార్డులు సిద్ధం చేయాల్సిఉంది. ఈ సెక్షన్‌లో పలుచోట్ల భూములపై కోర్టు కేసులు నడుస్తున్నాయి.నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే (ఎన్‌హెచ్ 163జీ)ను ప్రత్యేక ఎకనామిక్ కారిడార్ చేయాలనే తలంపుతో కేంద్రం ఏర్పాటు చేసింది. అయితే ఈ హైవే పరిధిలోని ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో సుమారు 280 కిమీ మేర గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు జరుగుతుండగా..1,394 హెక్టార్ల భూసేకరణ అవసరం కాగా..ఇప్పటివరకు 1,056 హెక్టార్ల భూసేకరణ మాత్రమే పూర్తయింది.జగిత్యాల, కరీంనగర్, వరంగల్, ఖమ్మం మధ్య ఉన్న ఎన్‌హెచ్ 563 పరిధిలో హైవే విస్తరణ పనుల కోసం 250 హెక్టార్ల భూసేకరణకుగాను 211 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది.


మిగతా భూసేకరణ కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం కోసం 1,920 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా..1,689 హెక్టార్ల భూసేకరణకు అవార్డులు చేసి ఎన్‌హెచ్ అధికా రులకు పంపించారు. ఇంకా సుమారు 12శాతం భూసేకరణ పూర్తయితే ఒకేసారి మొత్తం పనులు చేపట్టేందుకు అవకాశం లభిస్తుంది. రూ.18,772 కోట్లతో చేపట్టే ఉత్తర భాగం పనులను త్వరగా చేపట్టాలని ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉపరితల కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీని కోరారు. ఇప్పటికే పంటసాగు చేస్తున్న భూములను భూసేకరణలో భాగంగా ఇచ్చేందుకు రైతులు ఒప్పుకోవడం లేదు.

కొన్ని చోట్ల పట్టాదారులు అందుబాటులో లేకపోవడం కూడా సమస్యగా మారింది. మార్కెట్‌లో ఎకరా ధర రూ.50లక్షల నుంచి రూ.4కోట్ల వరకు పలికే చోట భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చే రూ.10లక్షలకు రైతులు, భూముల యజమానులు ఒప్పుకోవడం లేదు. ధర పెంచాలని కోరుతున్నారు. మరికొందరు భూములను ఇచ్చేందుకు ససేమిరా అంటూ కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. మరికొందరు రైతులు మాత్రం భూసేకరణకు ఒప్పుకుంటున్నా తమకు మరోచోట అంతేస్థాయిలో భూములు కావాలని కోరుతున్నారు. ఈ నెల 5వ తేదీన రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రానున్నారు. ఈ నేపథ్యంలో భూసేకరణను వేగవంతం చేస్తూ ఆయనతో రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. రాష్ట్రంలో చేపడుతున్న పలు జాతీయ రహదారుల ప్రాజెక్టుల్లో భూసేకరణలో ఏర్పడిన ఇబ్బందులను తొలగించేందుకు సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. భూసేకరణలో వెనకబాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# పరవాడ గ్రామ దుకాణాలలో వరుస అగ్ని ప్రమాదాలు

- బుధవారం రాత్రి అగ్నికి ఆహుతి అయ్యిన బాబు పాన్ షాప్


**జయభేరి, పరవాడ:**



మండల కేంద్రం అయ్యిన పరవాడలో సంతబయిల ఉన్న దుకాణాలలో వరుస అగ్ని ప్రమాదాలకు దారి తీస్తున్నాయి.ఇటీవల స్థానికంగా ఉన్న చెప్పులు షాప్ దగ్ధం అవ్వడం ఆ ప్రమదానికి సంబందించిన సరి అయ్యిన కారణాలు తెలియక ముందే ఆ పక్కనే ఉన్న బాబు పాన్ షాప్లో బుధవారం రాత్రి మంటలు అంటుకొని షాప్ మొత్తము దగ్ధము అయ్యిన సంఘటన చోటుచేసుకొంది. ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడానికి గల కారణాలు ఎవ్వరూ చెప్పలేకపోవడం గడిచిన కొన్ని నెలలుగా అదే దుకాణాలు వరుసలో 4 షాపులు ఒకే కారణంతో ప్రమాదాలు చోటుచేసుకోవడం గ్రామంలో పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి.గ్రామంలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్న, యాజమాన్యం లక్షల్లో నష్టపోతున్న పంచాయతీ పెద్దలు దీనిపై ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ ప్రమాదాలు జరిగిన దుకాణాలు అన్ని కూడా పంచాయతీ కార్యాలయంకి కూత వేటు దూరంలోనే ఉండడం ప్రమాదాలు జరిగిన అన్ని షాపులు సంతబయిల దుకాణాల సమూదాయం దగ్గరే ఉడడం, ఆ దగ్గర లో ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడం వలన నెలల వ్యవధిలోనే ఒకే రీతిలో అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తున్నాయో అని ప్రజల్లో పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి.ఇలాంటి సంఘటలను మున్ముందు జరగకుండా నిజాలు నిగ్గు తెలాలి అంటే పరవాడ సంత బయిల దుకాణాలు సమూదాయాలు దగ్గర పంచాయతీ పెద్దలు స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ చేసి దానిపై చర్యలు తీసుకోవాలని గ్రామంలో ప్రజలు కోరుతున్నారు.

# శ్రీ శ్రీ శ్రీ హింగ్లా భవాని అమ్మవారిని దర్శించుకున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మండలంలోని కొర్ర తండా గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ హింగ్లా భవాని అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి హాజరై,అమ్మవారిని దర్శించుకోని, అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్. ఎమ్మెల్యే ని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. దేవరకొండ నియోజక వర్గ ప్రజలంతా సుఖశాంతులతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని శ్రీ శ్రీ శ్రీ హింగ్లా భవాని అమ్మవారిని ప్రార్థించడం జరిగింది. ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి నిరుపేదలకు అండగా నిలుస్తాం అన్నారు. మా ప్రజా ప్రభుత్వ ప్రయత్నానికి ఆ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో PACS చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు వేమన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి,మేకల శ్రీనివాస్ యాదవ్,జడ్పీటీసీ సలహాదారుడు యుగంధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వేంకటేశ్వర్లు, నేరేడుగొమ్ము మండల పార్టీ అధ్యక్షులు లోకాసాని కృష్ణయ్య, మాజీ ఎంపీపీలు గోవింద్ యాదవ్, బిక్కు నాయక్, సీనియర్ నాయకులు తిపార్థి రుక్మారెడ్డి, మాజీ సర్పంచ్ రవి నాయక్,ప్రజా ప్రతినిధులు, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచులు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, NSUI నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- సప్లమెంటరీ లో 100% ఉత్తీర్ణత సాధించాలి
- గత పది యేండ్లుగా ఫెయిల్ అయిన విద్యార్థులు డాటా సేకరించాలి
- అందరూ పరీక్ష రాసేలా చూడాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జయభేరి, కరీంనగర్:**

పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి సప్లమెంటరీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మండల విద్యాధికారులను ఆదేశించారు. పదవ తరగతి ఫలితాలు, విద్యాశాఖలో భవిష్యత్తు కార్యాచరణ పై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలలో చదివిన 6,200 మంది విద్యార్థుల్లో 5995 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫెయిల్ అయిన 205 మంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వచ్చే నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

అదేవిధంగా 2015 నుండి ఇప్పటివరకు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల డాటా సేకరించాలన్నారు. ఇప్పటివరకు ఉత్తీర్ణత సాధించలేని, పరీక్ష ఫీజు చెల్లించకుండా ఉండిపోయిన వారి వివరాలు సేకరించి వారందరితో పరీక్ష ఫీజు చెల్లించేలా చూడాలని అన్నారు. ఫెయిల్ అయిన సబ్జెక్టుల్లో ప్రాక్టీస్ చేయించి వారంతా రానున్న సప్లమెంటరీలో పాస్ అయ్యేలా, ఉన్నత చదువు కొనసాగించేందుకు అవకాశం వచ్చేలా చూడాలని అన్నారు.

రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. ఈ ఏడాది పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 96.69 శాతం మంది ఉత్తీర్ణత సాధించిన విషయాన్ని వారికి తెలియజేయాలని అన్నారు. మండల విద్యాధికారులు అన్ని పాఠశాలలను సందర్శించి అక్కడ కావలసిన సౌకర్యాల నివేదికను సమర్పించాలని అన్నాను. విద్యార్థులు తక్కువ, ఎక్కువ ఉన్న పాఠశాలలను గుర్తించి ఫర్నిచర్ సర్దుబాటు చేయాలని సూచించారు. ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీలు భవిత కేంద్రాలను తక్కువ విద్యార్థులు ఉండి గదులు ఖాళీగా ఉన్న పాఠశాలలోకి మార్చాలని ఆదేశించారు. వీలైనన్ని అంగన్వాడీలను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. భవిత కేంద్రాల ఆధునీకీకరణ పనులను, సమ్మర్ క్యాంపులను పర్యవేక్షించాలని ఎంఈఓ లను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, కోఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్ ఆంజనేయులు, డిసిడిఓ కృపారాణి, సిడిపిఓలు సబితా శ్రీమతి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు.. కండిషన్ల తిరకాసులు

✍ జయభేరి, వరంగల్, మే 1:



ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే.. ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తోంది. విడతల వారీగా నగదును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో వేస్తోంది. అయితే.. ప్రభుత్వం రూ.5 లక్షలకు తోడు.. ఇంకా కొంచెం డబ్బులు కలిపి మంచిగా ఇల్లు కట్టుకోవాలని చాలామంది అనుకున్నారు. కానీ.. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపే నిర్మించుకోవాలని ప్రభుత్వం షరతు పెడుతుండటంతో.. లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రంలో 70 వేల 122 ఇళ్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో 2వేల 830 మంది లబ్ధిదారులు పునాదిని పూర్తి చేసుకున్నారు. సుమారు 280 మందికిపైగా 600 చదరపు అడుగులకుపైగానే ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. దీన్ని గుర్తించిన అధికారులు మొదటి విడత బిల్లు రూ.లక్ష విడుదలకు నిరాకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునాదిలో మార్పులు చేసుకుంటేనే బిల్లులు అందిస్తామని స్పష్టం చేస్తున్నారు.ఈ పథకంలో భాగంగా సొంత స్థలాలు ఉన్నవారు తమకు నచ్చిన విస్తీర్ణంలో నిర్మాణాలు చేసుకోవచ్చని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం పలు సందర్భాల్లో వెల్లడించింది. ఇందిరమ్మ మోడల్ ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులో ఉంచింది. ఎలాంటి నిబంధనలను పెట్టబోమని స్పష్టం చేసింది. కానీ తాజాగా అధికారులు 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్యలోనే ఇంటిని నిర్మించుకోవాలని పదేపదే చెబుతుండడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు కాకుండా.. తాము కూడా ఇంటికి అదనంగా ఖర్చు చేసుకుంటున్నామని, ఇప్పుడు నిబంధనలు విధిస్తే ఎలా అని లబ్ధిదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. 600 చదరపు అడుగులు దాటితే బీపీఎల్ పరిధిలోకి రారని అధికారులు వివరిస్తున్నారు. పేదల ఇళ్లను 400 చదరపు అడుగుల్లోనే నిర్మించాలని.. ప్రభుత్వం అదనంగా 200 చదరపు అడుగులకు పెంచిందని గృహ నిర్మాణ శాఖ చెబుతోంది. 5వ తేదీలోపు ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఉండాలనే నిబంధనను విస్తృతంగా ప్రచారం చేయాలని.. క్షేత్రస్థాయి అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం కాకుండా.. నచ్చినట్టు కట్టుకుంటే బిల్లులు రావనే విషయంపై అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

**తాపీ మేస్త్రీలకు ఫుల్ డిమాండ్**

ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో సమస్యలు ఎదురవుతున్నాయి. కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులపై ఒత్తిడి పెరిగింది. అయితే ఈ పథకం ముదుకు సాగాలంటే.. భవన నిర్మాణ పనులు చేపట్టే తాపీ మేస్త్రీలు కీలకం. కానీ ప్రస్తుతం సరిపడా లేరు. దీంతో ప్రభుత్వ ఆదేశంతో అధికారులు దృష్టిపెట్టారు. గ్రామాల్లో కొరత ఉండటంతో.. ఎంపిక చేసిన కొందరికి శిక్షణ ఇప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు.యువత అన్ని రంగాల్లో పని చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ భవన నిర్మాణ రంగానికి వచ్చేసరికి విముఖత కనబరుస్తున్నారు. దీంతో శిక్షణ ఇప్పించడం కూడా అధికారులకు కష్టంగా మారుతోంది. అయినా కొందరిని ఎంపిక చేసి.. నిర్మాణ పనుల్లో ఎదురయ్యే ఆటంకాలు, మెలకువలు ఇతర అంశాలపై నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించనున్నారు.ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తోంది. ఆ ఖర్చుతోనే దృఢమైన నిర్మాణం ఎలా చేపట్టాలి, పునాది ఎలా ఉండాలి, సిమెంటు, ఇసుక, కంకర ఎంత పరిమాణంలో వినియోగించాలి, గోడ గట్టిగా ఉండాలంటే ఏంచేయాలి, స్లాబ్‌లో ఇనుము ఎంత వాడాలి ఇతర అంశాలపై అయిదు రోజులపాటు భోజన సౌకర్యంతో శిక్షణ ఇప్పించనున్నారు. ఇందిరమ్మ ఇళ్లే కాకుండా.. భవిష్యత్తులో ఇతర ప్రైవేటు భవన నిర్మాణాల్లోనూ వీరికి ఉపాధి లభించేలా చేస్తామని అధికారులు భరోసా ఇస్తున్నారు.కొరత లేకుండా చేసేందుకు మహిళా తాపీమేస్త్రీలను కూడా ప్రభుత్వం రంగంలోకి దించుతోంది. తొలిసారిగా మహబూబ్ నగర్ జిల్లాలో 40 మంది మహిళలు తాపీ మేస్త్రీలుగా శిక్షణ తీసుకున్నారు. వీరికి కూడా న్యాక్ ఆధ్వర్యంలోనే శిక్షణ ఇచ్చారు. గతంలో భవన నిర్మాణ కూలీలుగా పనిచేసిన అనుభవం ఉన్న మహిళలను ఎంపిక చేశారు. వీరికి తక్కువ బడ్జెట్ లో ఇంటిని ఎలా నిర్మించాలో శిక్షణలో వివరించారు.తెలంగాణతో పోలిస్తే.. ఆంధ్రాలో తాపీ మేస్త్రీలు ఎక్కువగా ఉంటారు. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎక్కువ మంది ఉంటారు. ఇప్పటికే హైదరాబాద్ సహా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో వీరు పని చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు తాపీ మేస్త్రీల కొరత రావడంతో.. ప్రస్తుతం వీరికి డిమాండ్ పెరిగింది. ఆంధ్రా సరిహద్దు జిల్లాల్లో కొందరు లబ్ధిదారులు ఇప్పటికే వీరిని సంప్రదించారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఆంధ్రా ప్రాంతానికి తాపీ మేస్త్రీలు పనులు చేస్తున్నారు.



# కొత్త డీజీపీ ఎవరు..?

■ రేసులో ఆరుగురు.. తెర పైకి సౌమ్య మిశ్రా

✍ జయభేరి, హైదరాబాద్, మే1:

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు తదుపరి బాస్ ఎవరు? అనే చర్చ మొదలైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 6వ తేదీతో డీజీపీ డా.జితేందర్ పదవీకాలం ముగుస్తుండటంతో ఆయన తర్వాత ఎవరు బాధ్యతలు స్వీకరిస్తారనేది ఆసక్తికరంగా మారింది.దీని కోసం ప్రభు త్వం తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 7 మంది ఐపీఎస్ అధికారులతో ప్యానెల్ లిస్ట్‌ను సిద్ధం చేసినట్టు సమాచారం. జాబితాను యూపీఎస్సీకి సిఫారసు చేసిందని తెలుస్తోంది. ఈ లిస్ట్ నుంచి యూపీఎస్సీ ముగ్గురు అధికారుల పేర్లను సిఫారసు చేస్తుంది. వారిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమించే అవకాశం ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారుల్లో తెలంగాణకు తర్వాత డీజీపీ ఎవరు కాబోతున్నారనే అంశంపై స్పష్టత వస్తుంది.రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన ప్యానెల్ లిస్టులో 1990 బ్యాచ్‌కు చెందిన రవిగుప్తా, 1991బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్, 1994 బ్యాచ్‌కు చెందిన ఆప్టే వినాయక్ ప్రభాకర్, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, బీ శివధర్‌రెడ్డి, డా. సౌమ్యమిశ్రా, శిఖా గోయల్ ఉన్నట్టు తెలుస్తోంది. కొత్త డీజీపీ నియామకంలో సీనియా రిటీకి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.అయితే రవి గుప్తా, సీవీ ఆనంద్, బీ శివధర్‌రెడ్డి, సౌమ్యమిశ్రా పేర్లు ప్రముఖంగా వినిపిస్తు న్నాయి. రవి గుప్తా ప్రస్తుతం హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్నారు. ఆయన గతంలో 2023 డిసెంబర్ నుంచి 2024 జూలై వరకు డీజీపీగా కూడా పనిచేశారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్‌రెడ్డి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారు.సీవీ ఆనంద్ ప్రస్తుతం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. సీవీ ఆనంద్ 2028 జూన్‌లో రిటైర్ కానున్నారు. సౌమ్య మిశ్రా, శిఖా గోయల్‌తో పాటు ఏడీజీలు మహేశ్ మురళీధర్ భగవత్, సజ్జనార్, స్టీఫెన్ రవీంద్ర పేర్లు కూడా వినిపిస్తున్నాయి. తీర్పు ప్రకారం రాష్ట ప్రభు త్వం డీజీ కేడర్‌లోని సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపా ల్సి ఉంటుంది. యూపీఎస్సీ ముగ్గు రు అధికారుల ప్యానెల్‌ను సిఫారసు చేస్తుం ది. వారిలో ఒకరిని డీజీపీగా నియమించాలి. డీజీపీగా నియమితులయ్యే అధికారికి కనీ సం 30 ఏళ్ల సర్వీసు ఉండాలి. డీజీ లేదా ఏడీజీ ర్యాంక్ కలిగి ఉండాలి. కనీసం ఆరు నెలల సర్వీసు మిగిలి ఉండాలి.నియామకంపై సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ సూ ర్యకాంత్, జస్టిస్ దీపాంకర్‌దత్తా, జస్టిస్ ఉజ్జల్‌భుయాన్‌తో కూడిన బెంచ్ కీలక తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలంగాణకు డీజీపీగా ఉన్న జితేందర్ పదవీ కాలం సెప్టెంబర్ 6న ముగుస్తుంది. అందులో భా గంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీ నియామకానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచా రం. రవిగుప్తా, బీ శివధర్‌రెడ్డిలతో పోలిస్తే సీవీ ఆనంద్, ఆప్టే వినాయక్ ప్రభాకర్, సౌమ్య మిశ్రా, శిఖా గోయల్‌లకు ఎక్కు వ పదవీ కాలం ఉండటంతో రాష్ట్ర ప్రభు త్వం ఎవరిని తెలంగాణ కు కొత్త డీజీపీగా నియమిస్తుందో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# తెలుగులో టీజీపీఎస్సీ రాసిన వారు చెప్పండి

✍ జయభేరి, హైదరాబాద్, మే 1:

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల గ్రూప్ 1 ఫలితాలు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది మొదల్లు పరీక్షలు, ఫలితాలు, మూల్యాంకనం, ర్యాంకులు.. ఇలా ప్రతిదీ వివాదాస్పదంగా మారాయి. టీజీపీఎస్సీ ఫైనల్ ఫలితాల్లో తెలుగు మీడియంకి చెందిన అభ్యర్థులు ఒక్కరూ ఎంపిక అవకపోవడం ఈ వివాదాలకు ఊతమిచ్చినట్లైంది. దీంతో పలువురు అభ్యర్థులు ఈ వ్యవహారంపై హైకోర్టు ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం బుధవారం (ఏప్రిల్ 30) విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. వరుస హాల్‌టికెట్ల వారికి ఒకే విధమైన మార్కులు వచ్చాయని, నిర్దేశించిన సమయానికి ప్రొవిజనల్ మార్కుల జాబితా ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు. పైగా కొన్ని పరీక్ష కేంద్రాల్లోని వారే అధికంగా ఎంపికైనట్లు వెల్లడించారుఆ తర్వాత 20 రోజులకి తుది మార్కులు టీజీపీఎస్సీ వెల్లడించిందనీ.. ఆ 20 రోజుల్లో అవకతవకలు జరిగాయనే అనుమానంగా ఉందని అన్నారు. పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం మూల్యాంకన ప్రక్రియ గురించి టీజీపీఎస్సీని ప్రశ్నించింది. తెలుగులో రాసిన అభ్యర్థులకు ఎలా మార్కులు వేశారని ప్రశ్నించింది. దీనితోపాటు తెలుగులో రాస్తే తక్కువ మార్కులేశారని ఆరోపణలు వస్తున్నాయి. జవాబులకు సంబంధించి ఏదైనా కీ పేపర్ ఏదైనా ఉంటుందా? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల కీ ఇచ్చారా? అంటూ టీజీపీఎస్సీకి వరుస ప్రశ్నలు సంధించింది. దీనిపై కమిషన్ స్పందిస్తూ.. ఎవాల్యుయేటర్లకు ఎలాంటి కీ ఇవ్వలేదని తెలిపింది. డిస్క్రిప్టివ్ పరీక్ష కావడంతో కీ ఇవ్వడం కుదరదని, జవాబు పత్రాలు దిద్దిన వారు ఆయా సబ్జెక్టుల్లో నిపుణులని కోర్టుకు టీజీపీఎస్సీ సమాధానం ఇచ్చింది.కమిషన్ సమాధానాలు విన్న కోర్టు.. తెలుగులో ఎంతమంది రాశారో? ఎంత మంది ఎంపికయ్యా? వంటి వివరాలు ఇవ్వాలని టీజీపీఎస్సీని కోర్టు ఆదేశించింది. ఈ పరీక్షతోపాటు గత గ్రూప్ 1 అభ్యర్థుల వివరాలుసైతం ఇస్తామని కోర్టుకు టీజీపీఎస్సీ తెలిపింది. ఏళ్లుగా నిరుద్యోగులు గ్రూప్ 1 కోసం ఎదురుచూస్తున్నారని, ఆలస్యం లేకుండా విచారణ ముగించాల్సి ఉందని అభిప్రాయపడిన హైకోర్టు.. తదుపరి విచారణ ఈ రోజు చేపట్టనుంది.

# మహిళల ఆర్థిక స్థిరత్వమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

■ ఇచ్చిన ప్రతి హామీ ని నెరవేరుస్తాం
■ రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
■ పట్టణంలో 410 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
■ మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు

✍ జయభేరి, మంథని:



మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గురువారం మంత్రి శ్రీధర్ బాబు మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సైతం పాల్గొన్నారు. మంథని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీపాద కుట్టు మిషన్ కేంద్రం, ఇందిరా మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన 2.5 లక్షల విలువ గల మొబైల్ క్యాంటీన్, మార్కెట్ ఏరియాలో 5 లక్షల విలువగల నైనిక నైటీస్ ఫ్యాషన్ వేర్ మ్యాచింగ్ సెంటర్ ను మంత్రి ప్రారంభించారు. పాత పాల కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలం పరిశీలించారు. మొబైల్ క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి అధికారులతో కలిసి టిఫిన్ చేసి చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలి, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలచే కుట్టు మిషన్ కేంద్రాలు, మొబైల్ క్యాంటీన్, వివిధ వ్యాపార యూనిట్ల స్థాపనకు కృషి చేస్తున్నామని అన్నారు.

మంథని పట్టణంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి శ్రీపాద కుట్టు మిషన్ కేంద్రం ద్వారా 10 మంది మహిళలకు ఉపాధి లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించిందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించాలని ప్రయత్నంతో మంథని లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మహిళ సోదరీమణులు వ్యాపార విస్తరణలో ఎటువంటి కార్యాచరణ తీసుకున్న ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించామని, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా అనేక మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని, ప్రయాణాలు చేస్తూ వాణిజ్య వ్యాపార రంగాలలో ఎదిగేందుకు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని మంత్రి తెలిపారు. మంథని పట్టణంలో ఇండ్లు లేని నిరుపేదలకు మొదటి జాబితాలో 410 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, ఇండ్ల స్థలం లేని వారికి కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వ స్థలం గుర్తించే కార్యక్రమం కలెక్టర్, ఆర్డిఓ ఆధ్వర్యంలో జరుగుతుందని అన్నారు. ప్రజలు ఓపికతో ఉండాలని ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద క్యాంటీన్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి వివిధ అంశాలలో మహిళలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కుమార స్వామి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ లక్ష్యం ఏమిటీ

✍ జయభేరి, హైదరాబాద్, మే 1:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడైన కేసీఆర్‌పై సూటిగా ప్రశ్నలు సంధించారు. ప్రతిపక్ష నాయకుడిగా అన్ని సౌకర్యాలు, హోదాలు కల్పించినప్పటికీ, ఆయన బాధ్యతలను నిర్వర్తించకుండా ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకోవడం ఎందుకని రేవంత్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షం బలంగా, చురుకుగా ఉండాలని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. కేసీఆర్ ప్రజల సమస్యలపై గొంతు వినిపించకపోవడం, సభలో చురుకైన పాత్ర పోషించకపోవడం పట్ల రేవంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ తన వ్యాఖ్యల్లో ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలను గుర్తు చేస్తూ, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు నాయకులు వారి దగ్గరకు వెళ్లి సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. “పిల్లల్ని పంపేందుకు మీరెందుకు ప్రతిపక్ష నాయకుడిగా ఉండాలి? పార్టీ అధ్యక్షుడిగా ఉండి ప్రజల కోసం ఎందుకు పనిచేయట్లేదు?” అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ నాయకులు కేవలం అధికారం, ఆదాయం కోసం కాకుండా, ప్రజల సేవ కోసం పనిచేయాలని రేవంత్ పరోక్షంగా సూచించారు. ఈ వ్యాఖ్యలు ప్రతిపక్ష నాయకత్వంలో చోటుచేసుకున్న నిష్క్రియాత్మక వైఖరిని ఎత్తిచూపేలా ఉన్నాయి.రేవంత్ రెడ్డి తన విమర్శల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షం యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేశారు. ప్రతిపక్షం కేవలం విమర్శలకు పరిమితం కాకుండా, ప్రభుత్వ విధానాలను పరిశీలించి, ప్రజలకు అనుకూలమైన సూచనలు అందించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఈ బాధ్యత నుంచి తప్పుకోవడం వల్ల ప్రజల సమస్యలు సరిగా చర్చకు రావడం లేదని రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ఆయన ప్రతిపక్షం చురుకైన పాత్ర పోషించాలని, అవసరమైతే ప్రభుత్వంతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న డైనమిక్స్‌ను సూచిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం నిష్క్రియంగా మారినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కేసీఆర్ శాసనసభలో చురుకుగా పాల్గొనకపోవడం, ప్రజల మధ్యకు వెళ్లకపోవడం వంటి అంశాలు బీఆర్ఎస్ పార్టీపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రేవంత్ వ్యాఖ్యలు రాజకీయంగా కేసీఆర్‌ను ఒక కూడలిలో నిలబెట్టే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి.మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ప్రకటిస్తోంది. ఈ సమయంలో ప్రతిపక్షం నిద్రాణస్థితిలో ఉండటం వల్ల ప్రభుత్వం తన విధానాలను మరింత బలంగా అమలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కేవలం విమర్శలకు పరిమితం కాకుండా, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం యొక్క బాధ్యతాయుతమైన పాత్రను గుర్తుచేసే విధంగా ఉన్నాయి. కేసీఆర్ ఈ పిలుపును స్వీకరించి, మరింత చురుకైన రాజకీయ పాత్ర పోషిస్తారా లేక ఈ విమర్శలను పట్టించుకోకుండా మౌనంగా ఉంటారా అనేది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన అంశంగా మారింది.

# అంగన్వాడీలకు వేసవి సెలవులు

■ గురువారం నుండి నెలరోజుల పాటు
■ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



✍ జయభేరి, హైదరాబాద్:

అంగన్ వాడీ కేంద్రాలకు గురువారం నుంచి నెల రోజుల పాటు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. తల్లిదండ్రులు, అంగన్ వాడీ యూనియన్ల విజ్ఞప్తి మేరకు మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నిర్ణయం తీసుకున్నారు. ఆమె ఆదేశాల మేరకు అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అమీర్ పేట వెంగళరావునగర్ లోని కమిషనరేట్ లో బుధవారం అంగన్ వాడీ యూనియన్ నేతలతో డైరెక్టర్ కాంతి వెస్లీ సమావేశమయ్యారు. అనంతరం సెలవులు ప్రకటించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలవుల్లో కూడా అంగన్ వాడీ పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు గుడ్లు, సరుకులు అందిస్తామని డైరెక్టర్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ నెల రోజులు అంగన్ వాడీ టీచర్లు ఇంటింటి సర్వే, ఇండ్లకు వెళ్లి ఆరేండ్ల లోపు పిల్లలను అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డైరెక్టర్ ఆదేశించారు. సెలవులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి యూనియన్లు ధన్యవాదాలు తెలిపారు.

**కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు గుడ్ న్యూస్:**

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల్లో పనిచేస్తున్న సీఆర్టీలు కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల లకు 21 రోజుల సమ్మెకాలంకు వేతనాలు, మరణిస్తే అంత్యక్రియల కోసం రూ.30 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బుధవారం ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను ఐటీడీఏల నుంచి చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్కకు, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్ కు 2వేల టీచర్ కుటుంబాలు, తెలంగాణ అశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ టీచర్ సంఘం నేతలు ధన్యవాదాలు తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ అంధుల, బధిరుల ఆశ్రమ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో, వైకల్యాన్ని ఎదిరించి విద్యార్థులంతా ఉత్తీర్ణులు కావటం అభినందనీయమని, ఇతర విద్యార్థులకు వీరు ఆదర్శమన్నారు.

# ఆ ముగ్గురే నాకు ప్రేరణ



చిరంజీవిని ప్రేరణగా తీసుకొని నటులైన వాళ్లు టాలీవుడ్‌లో కోకొల్లలు. ఎందరినో తన నటన, డ్యాన్సుల ద్వారా ప్రభావితం చేశారు చిరంజీవి. మరి అలాంటి మెగాస్టార్‌ని కూడా ఓ ముగ్గురు ఓ రేంజ్‌లో ప్రభావితం చేశారట. నటుడిగా చిరంజీవిపై వారి ప్రభావం ఎంతో ఉందట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పారు. ముంబయ్ వేదికగా గురువారం జరిగిన 'వేవ్స్'(World Audio Visual Entertainment Summit)లో పాల్గొన్న చిరంజీవి.. తన సినీ ప్రయాణంలో తనని ఇన్‌స్పైర్ చేసిన వారిని గుర్తు చేసుకున్నారు. 'చిన్నప్పట్నుంచే డ్యాన్సులు చేస్తూ ఇంట్లో వాళ్లని, ఫ్రెండ్స్‌ని అలరించేవాడ్ని. వారంతా మెచ్చుకుంటుంటే ఏదో తెలియని కిక్. ఆ కిక్కే నన్ను నటన వైపు నడిపించింది. దాంతో చెన్నై రైలెక్కాను. నేను చెన్నైలో అడుగుపెట్టిన టైమ్‌లో మహామహులు ఇండస్ట్రీని ఏలుతున్నారు. 'ఇంతమంది సూపర్‌స్టార్లు ఉన్నారు కదా.. నేను కొత్తగా ఏం చేయగలను?' అని ఆలోచిస్తూ ఉండేవాడ్ని. 1977లో నటశిక్షణ పూర్తయింది. మేకప్ లేకుండా సహజంగా నటించే విషయంలో మిథున్ చక్రవర్తి.. స్టంట్స్, ఎమోషనల్ సీన్స్ చేసే విషయంలో అమితాబ్.. డ్యాన్స్ విషయంలో కమల్‌హాసన్.. ఈ ముగ్గురూ నాకు ప్రేరణగా నిలిచారు. వారి సినిమాలు చూస్తూ, నటనను పరిశీలిస్తూ నన్ను నేను మలచుకున్నా' అని చిరంజీవి చెప్పారు. రజనీకాంత్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# తన డ్యాన్స్ వెనక...

గత కొద్ది రోజులుగా అల్లు అర్జున్ పలు వివాదాలతో వార్తలలో నిలుస్తున్నారు. ఏపీ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌కి సపోర్ట్ గా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా వైసీపీ ఎమ్మెల్యే కోసం బన్నీ ప్రచారంలో దిగడంతో ఆయన మెగా ఫ్యామిలీకి దూరమయ్యాడనే టాక్ ఉంది. అయితే బన్నీ తాజాగా ముంబై వేదికగా నాలుగు రోజులపాటు జరుగుతున్న 'వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్' (వేవ్స్) లో చిరంజీవి గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. ప్రత్యేక చిట్ చాట్‌లో బన్నీ మాట్లాడుతూ.. తాను ఈ స్థాయికి చేరుకోవడం వెనక కారణం చిరంజీవి ఉన్నారని తెలిపారు. నటుడిగా నేను మారడానికి కారణం చిరంజీవి అని, ఆయన తనని ఎంతో ప్రభావితం చేశారని చెప్పుకొచ్చారు. 'మెగా' వివాదం వేళ బన్నీ వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారాయి. ఇక డ్యాన్స్ గురించి కూడా మాట్లాడిన బన్నీ తనకి డ్యాన్స్ అనేది స్వతహాగా వచ్చింది. ఎవరి దగ్గర ట్రైన్ తీసుకోలేదు. సెల్ఫ్ గానే తాను మంచి డాన్సర్‌ని అని, ఆ తర్వాత ట్రైనర్స్ సహాయంతో ఇంకా బాగా మౌల్డ్ అయినట్టు చెప్పుకొచ్చాడు.ఇక 10వ సినిమా షూటింగ్ తర్వాత తనకు యాక్సిడెంట్ జరిగిందని, అప్పుడు తన భుజానికి గాయం కావడంతో చిన్న సర్జరీ చేయడంతో, మూడు వారాలు రెస్ట్ తీసుకొని ఆ తర్వాత జిమ్ కు వెళ్లాను అని చెప్పుకొచ్చారు. ఇక తన జీవితంలోని స్ట్రగుల్స్ గురించి మాట్లాడుతూ, తన 18వ సినిమా ఫ్లాప్ సమయంలో చాలా ఇబ్బంది పడ్డట్టు చెప్పుకొచ్చారు. తన గురించి చాలా మంది రకరకాలుగా మాట్లాడుకున్నారని, ఇకపై తాను చేసే సినిమా అందరు మాట్లాడుకునేలా ఉండాలని భావించి చేసినట్టు తెలిపారు. ఆ సమయంలో బన్నీ 'అల వైకుంఠపురములో' సినిమాతో బిగ్గెస్ట్ హిట్ అందుకున్నానని చెప్పుకొచ్చారు. ఇక అట్లీ సినిమా గురించి చెబుతూ, ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లో ఈ చిత్రం ఉంటుదని తెలియజేశారు. ఇండియన్ మూవీస్‌లోనే ఇలాంటి మూవీ రాలేదు. ఒక గొప్ప సినిమాని చూడబోతున్నారని తెలియజేస్తూ మూవీపై మరింత ఆసక్తి పెంచాడు. ఏది ఏమైన బన్నీ చేసిన కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.



# సీరియస్ అయిన..

ఈ మధ్య మద్యం మత్తులో ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. పురుషులతో పాటు మహిళలు కూడా మద్యం సేవించి వాహనాలని నడుపుతూ పలువురి మరణానికి కారణం అవుతున్నారు. తాజాగా జైపూర్‌లో ఒక మహిళ మద్యం మత్తులో కారు నడిపి బాలిక ప్రాణాలను బలితీసుకుంది. తప్ప తాగి ఆమె కారు డ్రైవ్ చేస్తూ బైక్‌ని ఢీకొట్టడంతో బైక్ మీద ప్రయాణిస్తున్న ఓ చిన్నారి మృతి చెందింది. అయితే ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు ఆ మహిళని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో మహిళ పోలీసులని వదిలేయమంటూ రిక్వెస్ట్ చేయడం అందరిని ఆశ్చర్యపరిచింది. ఈ ప్రమాదం జాన్వీ కపూర్ దృష్టికి వెళ్లగా, ఆమె సోషల్ మీడియా వేదికగా కాస్త ఘాటుగానే స్పందించారు. ఇంత నిర్లక్ష్యపు ప్రవర్తనను ఎవరైనా అనుమతిస్తారా? 'మద్యం తాగి వాహనం నడపడం వల్ల చుట్టూ ఉన్న వారి ప్రాణాలకి ఎంత ముప్పు అనేది ఆలోచిస్తున్నారా? ఈ యాక్సిడెంట్ గురించి తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇటీవల మద్యం కారణంగా జరిగే ప్రమాదాలతో ఎంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. చట్టాలను మనం ఎందుకు గౌరవించడం లేదు? కనీస అవగాహన లేకుండా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నాం. ఈ తీరు మారాలి అంటూ జాన్వీ కపూర్ ఇన్‌స్టా వేదికగా తన ఆవేదన తెలియజేసింది.



# ఆంటీ టూ అందాల బ్యూటీ!

విపరీతమైన క్రేజ్ ను సంపాదించేసింది. ఇప్పుడేమో చడీ చప్పుడు కాకుండా.. ఓ సినిమాల్లోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తాజాగా రిలీజ్ అయిన తన డెబ్యూ మూవీ వీడియో గ్లింప్స్‌తో ఇప్పుడు తెలుగు టూ స్టేట్స్‌లో హాట్ టాపిక్ అవుతోంది ఈ బ్యూటీ. తాను హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన డెబ్యూ మూవీ కిల్లర్‌తోనే ఇప్పుడు తన ఫ్యాన్స్ అందరికీ షాకిస్తోంది జగతి అలియాస్ జ్యోతీరాయ్. వైమానిక శాస్త్రం కాన్సెప్ట్‌తో... లేడీ ఓరియెంటెడ్ సినిమాగా.. పూర్వజ్ డైరెక్షన్లో తెరకెక్కింది ఈ మూవీ. ప్రస్తుతం ఈ మూవీ టీజర్ యూట్యూబ్‌లో రిలీజ్ అయింది. ఇక ఈ టీజర్లో జ్యోతి రాయ్.. గ్లామరస్ గా కనిపించడమే కాదు.. ఫైటింగ్స్ అండ్ గన్ ఫైరింగ్‌లో సీన్స్‌లో కూడా ఇరగదీసినట్టు కనిపిస్తోంది. డి బౌండ్ అనే డిజార్డర్ తో బాధపడుతున్న హీరోయిన్.. పూర్తిగా కోలుకుంటే.. పునర్జన్మ ఎత్తినట్లే అని, అప్పుడు ఆమెకు ఎదురు నిలవడం ఎవరి వల్లా కాదని గ్లింప్స్ లో రివీల్ చేసిన స్టోరీ లైన్ అందరి అటెక్షన్‌ను గ్రాబ్ చేస్తోంది. అందులోనూ గ్లామరస్ కమ్.. సూపర్ షీ క్యారెక్టర్ లో జ్యోతి రాయ్ కనిపించడం ఈ మూవీ ప్లస్ అవుతుందనే కామెంట్ ఇప్పుడే వస్తోంది.



# షారుఖ్ అభ్యర్థన మేరకు..

బాలీవుడ్‌లో షారుఖ్, దీపికా పడుకోన్ కాంబినేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హిందీ చిత్రసీమలో హిట్ పెయిర్‌గా వారికి గుర్తింపు ఉంది. ఇప్పటివరకు వీరిద్దరు కలిసి ఐదు చిత్రాల్లో నటించగా.. అవన్నీ సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. తాజాగా ఈ జోడీ 'కింగ్' సినిమాలో నటించనుంది. షారుఖ్‌ఖాన్ తనయ సుహానా ఖాన్ ప్రధాన పాత్ర లో రూపొందుతున్న ఈ చిత్రానికి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. సుహానాఖాన్ గురువు పాత్రలో షారుఖ్‌ఖాన్ నటిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో దీపికా పడుకోన్ అతిథి పాత్రలో నటిస్తుందంటూ వార్తలొచ్చాయి. అవన్నీ పుకార్లేనని చిత్రబృందం కొద్ది వారాల క్రితం వివరణ ఇచ్చింది. తాజా సమాచారం ప్రకారం దీపికా పడుకోన్ ఈ సినిమాలో భాగం కానుందని తెలిసింది. తొలుత ఈ సినిమా కోసం 'కింగ్' టీమ్ తనను సంప్రదించినప్పుడు దీపికా పడుకోన్ సున్నితంగా తిరస్కరించిందట. ఇప్పటికే ఒప్పుకున్న సినిమాలతో పాటు పర్సనల్ లైఫ్‌కు సమయాన్ని కేటాయించాల్సి ఉందని, కొత్త సినిమాలు సైన్ చేయలేనని చెప్పిందట. ఆ తర్వాత అతిథి పాత్ర కోసం కత్రినాకైఫ్, సోనమ్ బజ్వా, ప్రీతిజింటా వంటి తారల్ని సంప్రదించారు. వారు కూడా పలు కారణాలతో ఒప్పుకోకపోవడంతో చివరకు షారుఖ్‌ఖాన్ రంగంలో దిగారు. దీపికా పడుకోన్‌ను ఫోన్‌లో సంప్రదించిన షారుఖ్‌ఖాన్ ఎలాగైనా అతిథి పాత్రలో నటించాలని అభ్యర్థించారట. ఆమె డేట్స్ కోసం అవసరమైతే షూటింగ్ షెడ్యూల్స్‌ను మార్చుతామని హామీ ఇచ్చారట. షారుఖ్ రిక్వెస్ట్ మేరకు చివరకు దీపికా సినిమాకు ఓకే చెప్పిందని బాలీవుడ్ టాక్. ఈ సినిమాను మేలో మొదలుపెట్టి ఆగస్ట్‌లోగా పూర్తి చేయాలని ప్లాన్ చేశారు. అయితే దీపికా పడుకోన్ కాల్షీట్స్ అక్టోబర్‌లో అందుబాటులో ఉండటంతో అప్పటి వరకు వేచిచూడాలని మేకర్స్ నిర్ణయం తీసుకున్నారని బాలీవుడ్ ఇండస్ట్రీ టాక్.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com